క్లుప్తంగా

52వ వార్డులో అన్న సమారాధన



అన్నసమారాధనలో నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయి రామ మందిరంలో గురువారం మధ్యాహ్నం మహా అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పొలిమేర వెంకట ఆదినారాయణ, అనురాధ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కొండబాబు, వరలక్ష్మి మనోజ్ ల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి గురువారం సుమారు 200 మందికి అన్న సమారాధన అందిస్తున్నామని ఆదినారాయణ తెలిపారు. జూలై 10న గురు పౌర్ణమి వేడుకలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోందన్నారు.

నూతన నియామకం



మల్లేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

సింథియా: ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి లేబర్ వర్కర్స్ అసోసియేషన్ న్యాయ సలహాదారుగా బొంగు వెంకట మల్లేశ్వరరావును నియమిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పెదిరెడ్ల నానాజీ తెలిపారు. సంఘం కార్యనిర్వాహక సమావేశంలో సభ్యులు తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. మల్లేశ్వరరావు నేతృత్వంలో కార్మికుల హక్కుల రక్షణ, వారి న్యాయపరమైన సమస్యలకు సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని భావిస్తున్నట్లు సంఘం సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు గుత్తుల మధుబాబు, వెంకటేష్, శ్రీనివాసరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మోదీ రాకను నిరసిస్తూ నేడు ఆందోళన

మల్కాపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖలో పర్యటించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాకను నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల దుస్తులతో ఈ ఆందోళన నిర్వహించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేయనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యతిరేకించకపోవడంపై నిరసన వ్యక్తం చేయనున్నట్టు ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, మెషినిస్ట్, పెయింటర్, వెల్డర్, ప్లంబర్, టర్నర్, మేసన్, షీట్‌మెటల్ ట్రేడ్‌లలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా ఆన్‌లైన్‌లో తిరిగి దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల జులై 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులు దరఖాస్తులో 'కాస్ట్ కాలమ్'లో 'ఎస్సీ' అని టైప్ చేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జులై 21న ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

వాల్తేర్ డివిజన్‌లో యోగాపై అవగాహన ర్యాలీలు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైల్వే కాలనీలు, రైల్వే స్టేషన్లు, రైల్వే కార్యాలయాల వద్ద యోగాపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. క్రీడాకారులు, రైల్వే అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలో యోగాసనాలు సాధన చేశారు.

బెల్టు షాపుల జోరు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో మద్యం సీసాలు

- బహిరంగ మద్యపానంతో ఇబ్బందులు
- రోడ్లపైనే మద్యం సీసాలు

గోపాలపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో బహిరంగ మద్యం సేవించడం, బెల్టు షాపుల బెడద పెరిగిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద కూడా మందుబాబుల సమస్య తీవ్రమైందని వాపోతున్నారు. గోపాలపట్నం పరిసర



మౌర్య సినిమా హాలు రోడ్డుపై మద్యం సీసాలు

ప్రాంతాలైన ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, కొత్తపాలెం, వెంకటాపురంలలో బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయని, కొందరు హోమ్ డెలివరీ కూడా చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఎన్ఏడీ జంక్షన్ వద్ద బార్ అండ్ రెస్టారెంట్లు నిర్ణీత సమయం తర్వాత కూడా మద్యం అమ్ముతున్నాయని, ఉదయం పూట కూడా నిరాటంకంగా అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని మద్యం దుకాణాల్లో షట్టర్ మూసి ఉన్నా, సిగ్నల్ చేస్తే మద్యం అందిస్తున్నారని తెలు…స్తోంది. …వెంకటాపురంలో …బెల్టు షాపుల నుంచి వచ్చిన మద్యం సీసాలను ఎల్‌జీ పాలిమర్స్ గేటు సమీపంలో బస్తాలతో పడేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మద్యం సేవించి మరణించిన ఘటనలు కూడా ఉన్నాయని, ఇటీవల యల్లపువానిపాలెంలో ఒక యువకుడు మద్యం మత్తులో కాల్వలో పడి మరణించిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు ఈ వ్యవహారాలన్నీ తెలిసినా, నెలవారీ మామూళ్లు అందుతుండటంతో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు, కూటమి నాయకుల అండదండలు ఉండటంతో బెల్టు షాపు నిర్వాహకుల జోలికి వెళ్లడం లేదని ఆరోపణలున్నాయి. కొత్తపాలెంలో టీడీపీ నాయకుడే బెల్టు షాపుల రింగ్‌మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ మద్యం సేవించడాన్ని నియంత్రించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మౌర్య సినిమా హాలు వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ-లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పరవాడ సిన్కో ఫార్మస్యూటికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి చట్టాల్లో వివిధ సెక్షన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బాక్సింగ్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు బాక్సింగ్ కిట్లు అందిస్తున్న మాజీ హవల్దార్ చిరంజీవి రెడ్డి, రావ్

సింథియా: సింథియా జై భీమ్ బాక్సింగ్ క్రీడాకారులకు ఆర్మీ మాజీ హవల్దార్ చిరంజీవి రెడ్డి బాక్సింగ్ కిట్లు అందజేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం సాధించిన మహిళా బాక్సర్ ధనుశ్రీకి ప్రోత్సాహక బహుమతిని అందించారు. జై భీమ్ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు గుర్రాల రామారావు మాట్లాడుతూ క్రీడాకారులకు సహాయం అందించిన చిరంజీవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యు.వి. రావ్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కైవసం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ క్రీడాకారులు చందు, డ్యాన్సర్ గణేష్, రాబిన్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



మధురవాడలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోనుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నారు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా కొమ్మాది జంక్షన్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై కక్ష గట్టి అంచెలంచెలుగా ఉద్యోగాల నుంచి తొలగించే కుట్రకు పూనుకున్నారని చెప్పారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం లేదని ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోదీ చేత కూటమి ప్రభుత్వం ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పేడాడ రాజ్‌కుమార్, టి.తిరుపతి, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్దనున్న యోగా ప్రధాన వేదిక, పార్క్ హోటల్ కూడలి, తెన్నేటి పార్క్, సీతకొండ, ఏవన్ గ్రాండ్, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను, తాగునీరు, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుధ్య పనులు, లైటింగ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణ జరపాలని సూచించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్ల వద్ద తగినంత నీటిని ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలంతా రాత్రి వస్తున్నందున లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ప్రాంతంలో అధిక సంఖ్యలో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని, విశాఖ ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, కె.వి.ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు



పాత డెయిరీఫారం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం వాహనాల రద్దీ

ఆరిలోవ: యోగాంధ్ర సందర్భంగా నగరంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. హైవేపై ఎండాడ నుంచి నగరం వైపు వెళ్తున్న వాహనాలు బారులు తీరుతున్నాయి. కూడళ్లలో ఎర్ర బల్బు వెలిగిందటే వందల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారిపై గురువారం డెయిరీ ఫారం కూడలి నుంచి హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ఉదయం నుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. బీచ్ రోడ్డులోకి వాహనాలు వెళ్లకుండా ఆపేశారు. దీంతో బీచ్ రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు సైతం హైవేపైకి మళ్లుతున్నాయి. ఎండాడ, జూ పార్కు, డెయిరీ ఫారం, హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ట్రాఫిక్ రద్దీ పెరిగింది. బుధవారం కూడా హనుమంతవాక నుంచి అటు డెయిరీ ఫారం, ఇటు వెంకోజీపాలెం వరకు వాహనాలతో రోడ్డు కప్పేసింది. సుమారు కిలోమీటర్ దూరం ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు.ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్రలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధంపై పేటెంట్



పరిశోధనా బృంద సభ్యులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్ బాబు, పరిశోధనా బృందం అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి ఒక గొప్ప విజయం సాధించారు. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాఫ్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 ఏళ్ల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ క్యాన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటంతోపాటు డ్రగ్-రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉందని పరిశోధనా బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈ బృందాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు అభినందించారు. ఈ ప్రయోగాత్మక విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు పేర్కొన్నారు.

సాయి మందిరంలో పూజలు



పూజలు అందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డులోని గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సద్గురు షిర్డిసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు హారతి పూజలతో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు, 8 గంటలకు బాబాకు పంచామృతాలు, విభూదితో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్థానిక మహిళలు బాబా భజనలను పాడుతూ, కోలాట నృత్యం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు పలువురు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి హారతి పూజలు జరిగాయి. ఆ తర్వాత బాబా పాదాలను పురవీధులలో ఊరేగింపు, పల్లకీ సేవ వంటి కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు అందుకున్నారు.

మృతుని కుటుంబానికి కార్మికుల చేయూత



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న షిప్‌యార్డ్ నాయకులు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ మాజీ సొసైటీ కార్మికుడు భీశెట్టి శ్రీనివాసరావు ఇటీవల అకాల మరణం చెందడంతో, ఆ కుటుంబానికి సహచర మాజీ సొసైటీ సభ్యులు తమ ఒకరోజు వేతనాన్ని అందజేశారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరామ్మూర్తి, ఇతర యూనియన్ సభ్యులు, మాజీ సొసైటీ కార్మిక నేతల చేతులమీదుగా 1,75,953 రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లాడ గోవింద్, భాస్కర పాడి, కన్వీనర్ యూవీ రాష్, నల్లా నాగరాజు, ఇతర సొసైటీ సభ్యులు, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

హరితాశ్రయానికి వెళ్లే దారేది?



హరితాశ్రయానికి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు

మల్కాపురం : 61వ వార్డు పరిధిలోని ఆర్‌కే పురం, కొత్త పెట్రోల్ బంకు వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన హరితాశ్రయం నిరుపయోగంగా మారింది. దీనికి ప్రధాన కారణం హరితాశ్రయానికి అడ్డంగా ద్విచక్ర వాహనాలను పార్కు చేయడమే. వేసవి కాలంలో పాదచారులు సేదతీరేందుకు వీలుగా పారిశ్రామిక ప్రాంత సేవా మార్గంలో పలుచోట్ల హరితాశ్రయ కుటీరాలను ఏర్పాటు చేశారు. అయితే ఆర్‌కేపురం వద్ద ఏర్పాటు చేసిన హరితాశ్రయం ముందు వాహనాలను అడ్డంగా నిలపడం వల్ల పాదచారులు దీనిని ఉపయోగించుకోలేకపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాంబశివరావుకు ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్



ఆచార్య సాంబశివరావును సత్కరిస్తున్న ఆచార్య సుదర్శనరావు తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఎస్.సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్)లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఐఐపీఏ) విశాఖ ప్రాంతీయ కేంద్రం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఐఐపీఏ విశాఖ కేంద్రం చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ విశాఖలో ఉద్యోగుల జీవన నాణ్యతపై ఉద్యోగుల సంక్షేమ పద్ధతుల ప్రభావం అనే అంశంలో పరిశోధనకు సాంబశివరావు ఎంపికయ్యారని తెలిపారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం నుంచి 2024-26 సంవత్సరానికి ఈయన ఒక్కరే ఎంపికవడం విశేషమన్నారు. ఐఐపీఏ కార్యదర్శి ఆచార్య పీటీటి ప్రేమానందం మాట్లాడుతూ ఇలాంటి ఫెలోషిప్‌లకు ఏయూ ఆచార్యులు ఎంపికవడం వర్సిటీకి జాతీయస్థాయిలో మంచి గుర్తింపును తెస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఐపీఏ సభ్యులు ఆచార్య షమీం, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'తిలాదానం' చిత్రంపై చర్చ



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో వారాంతపు ఉత్తమ చిత్రాల ప్రదర్శనలో భాగంగా గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 2003 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన 'తిలాదానం'తెలుగు సినిమాను ప్రదర్శించారు. 90 నిమషాల నిడివి గల చిత్ర ప్రదర్శన అనంతరం చర్చా కార్యక్రమం జరిగింది. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సంధానకర్తగా వ్యవహరించి చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కె.టి.ఎస్.శాస్త్రి దర్శకత్వంలో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ చిత్రం నిర్మించిందన్నారు. బ్రాహ్మణిక సనాతన సాంప్రదాయానికి, సమ సమాజ స్థాపనకు మధ్య జరిగే సంఘర్షణే కథాంశమన్నారు. ఈ చిత్రం నిర్మించి 22 ఏళ్లు అయినా విడుదలకు నోచుకోలేదని, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన చిత్రమని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కళాకారుల వెల్ఫేర్ సంఘం అధ్యక్షురాలు ఇందిరా ప్రియదర్శిని, కార్యదర్శి బొట్టా నాగేశ్వరరావును ఫిల్మ్ సొసైటీ తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వలయంలో ప్రధాన కూడళ్లు



సిరిపురం కూడలిలో మోహరించిన పోలీసులు

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు విశాఖకు ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులను భారీ ఎత్తున మోహరించారు. ముఖ్యంగా ఆర్.కె.బీచ్‌కు వెళ్లే ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం, రామ్‌నగర్, మద్దిలపాలెం కూడళ్లలో పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.